# చైతన్య గళం

తెలుగు దిన పత్రిక




సంచిక :171 సంపుటి : 1 హైదరాబాద్ , రంగారెడ్డి, నాగర్ కర్నూల్ , మహబూబ్‌నగర్ గురువారం 25-7 -2024 వెల : .రూ. 5.00



## బడ్జెట్‌లో అన్ని రాష్ట్రాల పేర్లు ప్రస్తావించడం అసాధ్యం

- గతంలో కాంగ్రెస్ కూడా బడ్జెట్ ప్రసంగంలో ఇలాగే చేసింది
- రాజ్యసభలో విపక్షాల విమర్శలపై నిర్మల కౌంటర్
- బడ్జెట్ తీరుపై విపక్షాల నిరసన

**24, జూలై (చైతన్యగళం)-న్యూఢిల్లీ,**

కేంద్ర బడ్జెట్ విపక్షాపూరితంగా ఉందంటూ విపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తిప్పికొట్టారు. విపక్షాలు 'దారుణమైన ఆరోపణలు' చేస్తున్నాయని విరుచుకుపడ్డారు. తమ రాష్ట్రాలకు నిధులు, పథకాలు మంజూరు చేయలేదంటూ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు కాంగ్రెస్ సారథ్యంలోని విపక్ష పార్టీలు ఉద్దేశపూర్వకంగా ప్రయత్నాలు చేస్తున్నాయని అన్నారు. వివక్ష చూపారంటూ కాంగ్రెస్ విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే చేసిన ఆరోపణలపై నిర్మలా సీతారామన్ రాజ్యసభలో బుధవారంనాడు మాట్లాడుతూ, విపక్షాలు మరీ ముఖ్యంగా మల్లికార్జున్ ఖర్గే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని అన్నారు. చాలా రాష్ట్రాలు పేర్లు మంత్రి ప్రస్తావించ లేదని, కేవలం రెండు రాష్ట్రాల

-మిగతా 2 లో

# ఢిల్లీలో దీక్షకు నేను సిద్ధమే



- కెసిఆర్ సిద్దమా అని ప్రశనించిన సిఎం రేవంత్
- అసెంబ్లీలో తీర్మానంపై చర్చల్లో మాటల యుద్ధం
- ప్రతిపక్ష నేతగా కేసీఆర్ వస్తే.. ప్రభుత్వాధినేతగా తాను వస్తా
- కెటిఆర్, హరీష్ రావుల ప్రశ్నకు సమాధానం
- కెసిఆర్‌ను ఏకి పారేసిన సిఎం రేవంత్

**24, జూలై (చైతన్యగళం) హైదరాబాద్,**

రాష్ట్రానికి నిధుల కోసం దిల్లీలో దీక్ష చేయాలని భారాస ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్ రావు చేసిన డిమాండ్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. అయితే, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ వస్తే.. ప్రభుత్వాధినేతగా తాను వస్తానని రేవంత్ చెప్పారు. రాష్ట్రానికి నిధుల కోసమైనా కేసీఆర్ ముందుకు రావాలన్నారు. మీరే తారీఖు డిసైడ్ చేయండి దీక్షకు మేం సిద్దం.

-మిగతా 2 లో

## నేడు అసెంబ్లీలో బడ్జెట్ సమర్పణ



- బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి విక్రమార్క

**హైదరాబాద్,**

తెలంగాణ అసెంబ్లీలో ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. బుధవారం బడ్జెట్ అన్యాయాలపై చర్చించిన అనంతరం శాసనసభ నేటికి వాయిదా పడింది. మధ్యాహ్నం సభ తిరిగి ప్రారంభం కానుంది. మధ్యాహ్నం

-మిగతా 2 లో



## ఆర్టీసిని ఆగం చేసిన చరిత్ర హరీష్‌ది

-గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసిని బొందపెట్టింది

-ప్రశ్నోత్తరాల సమయంలో గట్టిగా జవాబిచ్చిన మంత్రి పొన్నం

**హైదరాబాద్,**

ప్రశ్నోత్తరాల సమయంలో ఆర్టీసీపై చర్చ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మంత్రి పొన్నం ప్రభాకర్ మధ్య మాటల యుద్ధం సాగింది. గత ప్రభుత్వం ఆర్టీసీని చంపాలని చూసిందని పొన్నం ఆరోపించారు. ఆర్టీసీ యూనియన్లను గత ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తు చేశారు. రూ. 280 కోట్ల బకాయిలు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆర్టీసీకి చెల్లించిందని తెలిపారు. హరీశ్ రావు వ్యాఖ్యలు

-మిగతా 2 లో

# కెసిఆర్ పోరాటం రామాయణమంత



- తెలంగాణ శాసించే స్థాయిలోనే ఉండాలి
- యాచిస్తే కేంద్రం పట్టించుకోదు
- అనేక సందర్భాల్లో కేంద్రంతో పోరాడం
- బడ్జెట్ వివక్షపై జరిగిన చర్చలె కెటిఆర్

**24, జూలై (చైతన్యగళం)హైదరాబాద్,**

కేంద్రంపై కేసీఆర్ ప్రభుత్వం చేసిన పోరాటం రాసుకుంటే రామాయణమంతా.. చెప్పుకుంటే భారతమంత అని కేటీఆర్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై జరిగిన చర్చలో కేటీఆర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'దేశ అత్యున్నత సభ పార్లమెంట్. ఏపీ పునర్విభజన చట్టం ఏదైతో ఉన్నదో అందులో రెండురాష్ట్రాలకు హామీ ఇచ్చారు. అటు ఆంధ్రా, ఇటు తెలంగాణకు హామీలు ఇచ్చారు. 35పైగా హామీలు ఇచ్చారు. ఒక రాష్ట్రానికి చేయూతనిచ్చి.. మరో రాష్ట్రానికి మొండిచేయిచూపడం అన్యాయం. పక్కవారు బాగుపడితే సంతోషపడుతాం. ఆంధ్ర రాష్ట్రానికి డబ్బులు ఇచ్చారు సంతోషం. మనకు ఇవ్వలేదనే తెలంగాణలోని ప్రతిబిడ్డలో ఉన్నది.

-మిగతా 2 లో

## పదేళ్ల తర్వాత అసెంబ్లీలో ప్రజాస్వామ్యం

-సమస్యలపై చర్చించేలా అవకాశం

-మంత్రి సీతక్క



**హైదరాబాద్,**

పదేళ్ల తర్వాత అసెంబ్లీలో ప్రజాస్వామ్యం కనిపిస్తోందని, బీఆర్ఎస్ హయంలో శాసనసభలో ప్రొటెస్ట్ చేస్తే సస్పెండ్ చేసే వారని, తెలంగాణ ఏర్పడిందే నియామకాల మీదని అలాంటి నియామకాలపై

-మిగతా 2 లో



## పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

-అధికారుల పనితీరు అలాగే ఉండాలి

-ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం చంద్రబాబు ఆదేశం

**24, జూలై (చైతన్యగళం)అమరావతి,**

రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని మంత్రులు, హెచ్‌వోడీలు, కార్యదర్శులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో 12 లక్షల మంది దుర్భరమైన పేదరికంలో ఉన్నట్టు సమావేశంలో పేర్కొన్నారు. వారందరినీ దాని నుంచి బయటపడేసేలా అమలు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల నుంచి నిధులు రాబట్టే అంశాలపై సచివాలయంలోని ఐదో బ్లాక్‌లో మంత్రులు, కార్యదర్శులు,

-మిగతా 2 లో

-మిగతా

## తెలుసుకోకుండా బడ్జెట్‌పై పోటీపడి విమర్శలా

- తెలంగాణకు ఎన్నో ప్రయోజనాలు సమకూరాయి
- పునర్విభజన చట్టం కింద ఎన్నో అభివృద్ధి పనులు
- బయ్యారం ఉక్కు సాధ్యంకాదనే పెట్టలేదు
- అసెంబ్లీలో తీర్మానంపై మండిపడ్డ కిషన్ రెడ్డి

2



# ఢిల్లీలో దీక్షకు నేను సిద్ధమే

(మొదటి తరువాయి)

తెలంగాణకు నిధులు తెచ్చుడో..సచ్చుడో తేల్చుకుందామని సవాల్ విసిరారు. చావు నోట్లో తల పెట్టి తెలంగాణ తెచ్చామని మేమెప్పుడూ పదే పదే చెప్పలేదు. రూ.100 పెట్టి పెట్రోల్ కొన్నారు కానీ, అగ్గిపెట్టి కొనలేదు. అగ్గిపెట్టి మర్చిపోయినట్టు నటించి అమాయక విద్యార్థులను బలిగొనలేదు అని రేవంత్‌రెడ్డి విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయంపై శాసనసభలో చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్ష నేతల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. పరస్పర విమర్శలతో సభ వేడెక్కింది. 'కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం' అనే అంశంపై రాష్ట్ర శాసనసభలో ఇవాళ చర్చ సందర్భంగా అన్ని పార్టీలు తమ అభిప్రాయాలను వెల్లడించాయి. బీఆర్ఎస్ తరపున కేటీఆర్ ఇప్పటికే మాట్లాడారు. అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం సరైన విధానాన్ని పాటించలేదని విమర్శించారు. అనంతరం తీర్మానంపై తన అభిప్రాయాన్ని వినిపించారు. ఆ తర్వాత మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. తెలంగాణకు అన్యాయంపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన తీర్మానాన్ని తాము ఏకగ్రీవంగా ఆమోదిస్తామని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందనే విషయం వాస్తవమని హరీశ్‌రావు అన్నారు. ఈ అన్యాయంపై రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్తామంటే వచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. అంతేకాదు, బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపినందుకు నిరసనగా సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో దీక్ష చేస్తానంటే తాము మద్దతిస్తామని చెప్పారు. అయితే అందుకు సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెబుతూ.. మాజీ సీఎం కేసీఆర్ ఢిల్లీ దీక్షకు వస్తానంటే తాను తప్పకుండా దీక్ష చేస్తానని అన్నారు. ఇదిలావుంటే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో పెట్టిన తీర్మానాన్ని నిరసిస్తూ బీజేపీ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు.

# బడ్జెట్‌లో అన్ని రాష్ట్రాల పేర్లు ప్రస్తావించడం అసాధ్యం

(మొదటి తరువాయి)

పేర్లే ప్రస్తావించానని ఖర్గే అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ చాలాకాలం ఈ దేశాన్ని పాలించింది. చాలా బడ్జెట్‌లు కూడా ప్రవేశపెట్టింది. ప్రతి బడ్జెట్‌లోనూ దేశంలోని అన్ని రాష్ట్రాల పేర్లు ప్రస్తావించే అవకాశం రాదనే విషయం ఆ పార్టీకి బాగా తెలుసు' అని నిర్మలా సీతారామన్ వివరించారు.

ఈ ఏడాది ఫిబ్రవరి 1న ఓట్ ఆన్ అకౌంట్ సమర్పించగా, ఈ ఏడాది మొత్తానికి మంగళవారం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టామని, ప్రసంగంలో ఎక్కువ రాష్ట్రాల పేర్లు ప్రస్తావించ లేదని సీతారామన్ చెప్పారు. మోదీ సారథ్యంలోని కేంద్ర మంత్రివర్గం వర్ధన్‌లో ఒక నౌకాశ్రయం ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని, కానీ మంగళవారంనాటి బడ్జెట్ లో మహారాష్ట్ర ప్రస్తావించలేదని అన్నారు. దాని అర్థం మహారాష్ట్రను నిర్లక్ష్యం చేసినట్టా? అని ప్రశ్నించారు.



తన ప్రసంగంలో ఎక్కువ రాష్ట్రాల పేర్లు, మేజర్ ప్రాజెక్టుల పేర్లు ప్రస్తావనకు రానంత మాత్రాన భారత ప్రభుత్వ స్కీమ్‌లు, పథకాలు వాటికి వర్తించవని అర్థమా వరల్డ్ బ్యాంకు, ఏడీబీ, ఏఐబీ వంటి సంస్థల నుంచి పొందిన ఎయిడెడ్ అసిస్టెన్స్ ఆ రాష్ట్రాలకు వెళ్లవని అర్థమా? అని ప్రశ్నించారు. బడ్జెట్ ప్రసంగంలో దేశంలోని అన్ని రాష్ట్రాల పేర్లు చోటుచేసుకోవడమనే అశంపై కాంగ్రెస్ పార్టీకి నిర్మలా సీతారామన్ సవాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ గతంలో చేసిన బడ్జెట్ ప్రసంగాల్లో అన్ని రాష్ట్రాల పేర్లు ప్రస్తావించిన సందర్భం ఒక్కటైనా ఉందా? అని మంత్రి ప్రశ్నించారు. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పలు రాష్ట్రాల పట్ల వివక్ష చూపించారంటూ 'ఇండియా' కూటమి ఎంపీలు పార్లమెంటు ఆవరణలో బుధవారంనాడు నిరసనకు దిగారు. కుర్చీని కాపాడుకునే బడ్జెట్, వివక్షాపూరిత బడ్జెట్‌అంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. విపక్ష నేతలు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీ సోనియాగాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, టీఎంపీ ఎంపీ డోలాసేన్ తదితరులు ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు.

# కెసిఆర్ పోరాటం రామాయణమంత

(మొదటి తరువాయి)

కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఇంత చిన్నచూపా అనే బాధ తప్పకుండా ఉన్నది. తెలంగాణ హక్కులను ఎవరు హరించినా.. ఎవరు ఇబ్బంది పెట్టినా తెలంగాణ ప్రయోజనాల విషయంలో వారి మెడలు వంచే బాధ్యత.. తెలంగాణ కోసమే పుట్టిన పార్టీగా.. తెలంగాణ గడ్డపై పుట్టిన పార్టీగా బీఆర్ఎస్‌దేననే మాట గుర్తు చేస్తున్నాను. కేసీఆర్ పోరాట పటిమ.. చేసిన కార్యక్రమాలు చెప్పాల్సి వస్తే.. పదేళ్లు కేంద్రంపై చేసిన ప్రయత్నాలు చెప్పాల్సి వస్తే రాసుకుంటే రామాయణమంతా.. చెప్పుకంటే భారతమంతా అంత కథ ఉన్నది. తప్పకుండా తీసుకురావాల్సిన బాధ్యత మామీద ఉన్నదని భావిస్తున్నాం' అన్నారు. రాష్ట్రం ఏర్పడ్డదో లేదో.. సీఎంగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేయకముందే తెలంగాణలోని ఏడుమండలాలను ఆర్డినెన్స్ ద్వారా ఆనాడు పోలవరం ముంపులో ఆంధ్రాలో కలిపితే మొట్టమొదటిగా స్పందించింది.. రాష్ట్రం బంద్‌కు పిలుపునిచ్చింది.. ఆ నాటి మా పార్టీయే. ప్రభుత్వం ఏర్పాటు చేయకపోయినా కొట్లాడింది మేమే. 2014, సెప్టెంబర్ 7న కేసీఆర్ ప్రధానిని కలిసి తెలంగాణ ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వండి.. హోదా ఇవ్వండని కోరారు. ఒకసారి కాదు 1.15లక్షల కోట్లు రాష్ట్రానికి ఇవ్వాలని సీఎంగా

కేసీఆర్ ఆ నాడు 2016 ఫిబ్రవరి 12లో కోరారు. ఇలా ఎన్నో సందర్భాల్లో కలిశాం. ఒక్కసారి కాదు.. ఎక్కని కొండ లేదు.. మొక్కని బండలేదు అన్నట్లు ప్రతి ప్రాజెక్టు విషయంలో కేంద్రం వద్దకు పలుసార్లు పోయాం. కొన్ని సాధించాం.. కొన్ని సాధించలేకపోయాం. రకరకాల ప్రయత్నాలు చేశాం. వివక్షపూరిత వ్యవహారం చేసినప్పుడు సీఏఏ, ఎన్‌పీఏ, ఎన్ఆర్‌సీలాంటి విషయాల్లో తెలంగాణ శాసనభలో తీర్మానాలు ప్రవేశపెట్టి పాస్ చేసి కేంద్రానికి నిరసన తెలిపాం. విద్యుత్ చట్టం తెచ్చి మోటార్లకు మీటర్లు పెట్టాల్సిందేనని మెడపై కత్తిపెడితే దాన్ని వ్యతిరేకిస్తూ సభలో తీర్మానం చేశాం. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ విషయంలో నిరసన తెలిపాం. ఈ సందర్భంగా ప్రసంగానికి భట్టి విక్రమార్క అడ్డు తగిలారు. దీనికి స్పందిస్తూ వివక్ష ఇవాల్సింది కాదు పదేళ్లది' అన్నారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నా లెక్కలేదు. ఓబీసీ గణన కావాలని స్టేట్ అసెంబ్లీలో తీర్మానం చేసి పంపాం. ఆఖరికి కేంద్రం రైతుచట్టాలు రైతులకు వ్యతిరేకంగా చేస్తే పార్లమెంట్‌లో నిరసన తెలిపాం. బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడితే మీకెందుకు ఇబ్బంది ? ఏం చెప్పాలో పంపండి. మాట్లాడుతాం. ఏం మాట్లాడాలో మీరే చెబుతారా? ఇది టూమచ్. నేను సీనియర్ సభ్యుడిని. ఐదుసార్లు గెలిచివచ్చాను. ఏం మాట్లాడాలో తెలుసు. హౌస్‌లో ఎలా ఉండాలో తెలుసు. ఈ రకంగా డిక్టేట్ చేయడం సరికాదు. మా పార్టీ పరంగా గతపదేళ్లు ప్రభుత్వంలో కేంద్రం ధాన్యం కొనుగోలు చేయనంటే మొత్తం కేబినెట్ సీఎంతో సహా.. నూకలు తినండి అంటే ఢిల్లీలో ధర్నా చేసి వచ్చిన వాళ్లం. మాకు ఏం కొత్తకాదు. రాష్ట్రపతి ప్రసంగాన్ని బహిష్కరించింది టీఆర్ఎస్ ఎంపీలు. బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీలో ఇక్కడ మాత్రమే కాకుండా ఢిల్లీలో నిరసన తెలిపింది మా ఎంపీలే'నన్నారు. కంటోన్మెంట్ విషయంలో కేంద్రం ఇబ్బందిపెడుతుంటే వాటిని లేవనెత్తింది మేమే. కోటి ఆశలతో ఏర్పడిన ఈ రాష్ట్రంలో కేంద్ర బడ్జెట్‌లో నిన్న అన్యాయం జరిగింది. రేవంత్‌రెడ్డి చిన్న వయసులోనే సీఎం అయ్యారు. కష్టపడి వచ్చారు. సంతోషం. రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు. ఉత్సాహంగా చాలా ఉత్సాహంగా ప్రధానిని, కేంద్రమంత్రులను కలిశారు. కలిసి ఎన్నో విజ్ఞాపనలు చేశారు. మేం ఇచ్చినట్లే మీరు రేవంత్‌రెడ్డి వినపత్రాలు ఇచ్చారు. కానీ, న్యాయం మీకు జరుగలేదు. మేం మొదటి చెప్పేది అదే. ప్రొఫెసర్ జయశంకర్ ఎప్పుడూ చెప్పేవారు. యాచిస్తే రాదు తెలంగాణ.. శాసిస్తే తెలంగాణ వస్తది చెప్పేవారు. ఇప్పుడు కూడా అదే చెబుతున్నాం. శాసించే స్థితిలో తెలంగాణ ఉండాలి. ఆనాడు సహకారం అందించినా,.. సమరం సాగించినా తెలంగాణ ప్రయోజనాలకే. ఏ రకమైన లాలూచి.. వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాజీపడలేదు. ఏడుమండలాలు గుంజుకున్నప్పుడు నిరసించింది మేమే.. నిరసన తెలిపింది మేమే. పదేళ్లలో ఐదేళ్లు కేంద్రంలో ఎంపీగా ఉన్నారు. ఒక్కరోజు గొంతు విప్పారా? తెలంగాణ రాష్ట్రం రావాల్సిన హక్కుల గురించి పార్లమెంట్‌లో ప్రసంగించారా? అంటూ నిలదీశారు. కేటీఆర్ ప్రసంగానికి స్పీకర్ మాట్లాడుతూ.. తీర్మానంపై మాట్లాడాలని సూచించగా.. తీర్మానం ఎక్కడ పెట్టారని ప్రశ్నించారు. నోటిమాటలతో తీర్మానాలు కావాన్నారు. చర్చపై మాట్లాడుతున్నాం. మీరు రాసిస్తే అదే చదువుతా. చర్చలో పాల్గొని మాట్లాడున్నాం. హైకోర్టు విభజన కూడా పోరాటాలతోనే సాధించాం. కృష్ణా జలాల విషయంలో ట్రిబ్యునల్ తేల్చాలని.. రెఫర్ చేయాలంటే పదేళ్ల వెంటపడితే.. చివరకు కేసీఆర్ గట్టిగా నిలదీస్తే మొన్న ట్రిబ్యునల్‌కు రెఫర్ చేశారు. మేం సాధించిన అతిపెద్ద విజయం. అందుకే శాసించి సాధించుకోవాలి తప్పా.. యాచిస్తే కేంద్రం లొంగదు' అన్నారు.

# పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి తరువాయి)

హెచ్‌వోడీలతో ఆయన సమావేశమయ్యారు.

ప్రభుత్వ సమీక్షలన్నీ నిర్దేశిత సమయంలోగానే పూర్తయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు వినూత్న ఆలోచనలు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రం ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పరిపాలనపై ఫోకస్ పెట్టాలన్న చంద్రబాబు.. కేంద్ర నుంచి తెచ్చే ఏ ఒక్క రూపాయిని వదలకుండా పూర్తి స్థాయిలో కేంద్ర పథకాలను అధ్యయనం చేయాలని వెల్లడించారు. మూస ధోరణిలో కాకుండా వినూత్నంగా ఆలోచన చేయాలన్నారు. పరిపాలనలో భాగంగా అధికారులకు తన వైపు నుంచి 100 శాతం మద్దతు ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. అధికారులకు వీలైనంత వరకు హ్యాండ్ హోల్డింగ్ అందిస్తామన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే తానూ కఠినంగా ఉంటానని తెలిపారు. గంటల తరబడి సమీక్షలకు తాను స్వస్తి పలికానని, అధికారులు కూడా రిజల్ట్ ఒరియేంటెడ్ పద్ధతిలో సమీక్షలు చేపట్టాలని సూచించారు.



# నేడు అసెంబ్లీలో బడ్జెట్ సమర్పణ

(మొదటి తరువాయి)

ం12 గంటలకు డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. తర్వాత బడ్జెట్‌పై చర్చ జరగనుంది. మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి బడ్జెట్‌పై చర్చకు సమాధానం ఇచ్చే అవకాశం ఉంది.కాగా, శాసనసభలో బుధవారం తెంగాణకు అన్యాయం' అనే తీర్మానంపై చర్చ జరిగింది. అన్ని పార్టీల నేతలు ఈ తీర్మానంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. బీఆర్ఎస్ తరపున పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీలో మాట్లాడారు. తీర్మానానికి వ్యతిరేకంగా బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు.

# ఆర్టీసిని ఆగం చేసిన చరిత్ర హరీష్‌ది

(మొదటి తరువాయి)

దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉన్నాయన్నారు. హరీష్ రావు ఆర్టీసీ గౌరవాధ్యక్షులుగా ఉన్నారని గుర్తు చేశారు. రిటైర్డ్ ఆఫీసరైన వాళ్ల బంధువును ఎండీగా పెట్టుకుని ఆర్టీసీని ఆగం చేశారని ఆరోపించారు. సమ్మె సమయంలో ఆర్టీసీ ఉండదని బెదిరించారని కార్మికులను బెదిరించారన్నారు. తాము అధికారంలోకి వచ్చాక మూడు వేల ఉద్యోగాల భర్తీకి నిర్ణయం తీసుకొని నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. అప్పుడు ఫైనాన్స్ మంత్రిగా ఉన్న హరీశ్ రావు బడ్జెట్ లో రూ. 1500 కోట్లు కేటాయించి 400 కోట్లు కూడా ఇవ్వలేదన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ, జాగాలను లీజులకు తీసుకు బకాయిలు కూడా కట్టేదని విమర్శించారు. దీనిపై సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు స్పందిస్తూ.. ఆర్టీసీ యూనియన్లపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ కు లేదన్నారు. ఆర్టీసీలో తమ పార్టీ అనుబంధం సంఘం గుర్తింపు యూనియన్ గా ఉందన్నారు. ఖమ్మంలో ఓ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నారని, ఎంతో మంచి వ్యక్తి చనిపోయారని గుర్తు చేశారు. యూనియన్లను రద్దు చేసిన వారికి మాట్లాడే అర్హత లేదని అన్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోడియం దగ్గర బైఠాయించి నిరసనకు దిగారు. ఇదే ప్రశ్నపై సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. ఆర్టీసీ యూనియన్ కు గౌరవాధ్యక్షుడిగా ఉన్న హరీశ్ రావును తప్పించేందుకే అప్పటి సీఎం కేసీఆర్ ఆర్టీసీ సంఘాల రద్దు నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు

# పదేళ్ల తర్వాత అసెంబ్లీలో ప్రజాస్వామ్యం

(మొదటి తరువాయి)

అధికారంలో వున్నపుడు బీఆర్ఎస్ స్పందించలేదని మంత్రి సీతక్క ఆరోపించారు. బుధవారం అసెంబ్లీ లాబీలో మంత్రి మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడారు. కాంగ్రెస్ అధికారం రాగానే 30 వేల ఉద్యోగాలతో పాటు, జాబ్ నోటిఫికేషన్‌లు ఇచ్చామన్నారు. అధికారం పోయాక బీఆర్ఎస్ నేతలకు నిరుద్యోగులు గుర్తుకు వచ్చి ప్రొటెస్ట్ చేయటం హాస్యాస్పదంగా ఉందన్నారు. పదేళ్లుగా ఉద్యోగాల భర్తీని పట్టించుకోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ కోసం డిమాండ్ చేయడం విడ్డూరమన్నారు. అసెంబ్లీ పోడియంలోకి వెళ్లినా.. ప్లకార్డులు ప్రదర్శించినా.. గత ప్రభుత్వం సస్పెండ్ చేసేదని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అలా చేయడంలేదని మంత్రి సీతక్క అన్నారు. గతంలో నిరసనలను అణగదొక్కిన బీఆర్ఎస్.. ఇప్పుడు నిరసనకు దిగడం ఆశ్చర్యకరమన్నారు. బీఆర్ఎస్ నిరసనలతో

రాష్ట్రంలో ఎంత ప్రజా స్వామ్యం వుందో అర్థం అవుతుందని, ఉద్యోగాల భర్తీలో వున్న చిక్కు ముడులను విప్పి నియామకాలు చేపట్టామని చెప్పారు. త్వరలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారామె.

# తెలుసుకోకుండా బడ్జెట్‌పై పోటీపడి విమర్శలా

**-తెలంగాణకు ఎన్నో ప్రయోజనాలు సమకూరాయి**
**-పునర్విభజన చట్టం కింద ఎన్నో అభివృద్ధి పనులు**
**-బయ్యారం ఉక్కు సాధ్యంకాదనే పెట్టలేదు**
**-అసెంబ్లీలో తీర్మానంపై మండిపడ్డ కిషన్ రెడ్డి**

న్యూఢిల్లీ,

భారాస, కాంగ్రెస్ నేతలు పోటీపడి మరీ ప్రధాని మోదీని విమర్శిస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. కేంద్ర నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోందని, ఓట్ల కోసం తప్ప ప్రజలకు నిధులు ఖర్చు చేయట్లేదని ఆరోపించారు. సంక్షేమ పథకాల కోసం కేంద్రం రూ.6లక్షల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని భారాస, కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్న నేపథ్యంలో ఆయన దిల్లీలో మీడియాతో మాట్లాడారు. పునర్విభజన చట్టం కింద అనేక హామీలు అమలు చేశాం. రామగుండంలో విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటు చేశాం. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి ప్రధాని శంకుస్థాపన చేశారు. గిరిజన వర్సిటీ కోసం కేంద్రం నిధులు మంజూరు చేసింది. జీఎస్టీ పరిహారం కింద రూ.7వేల కోట్లు అందజేశాం. జాతీయ రహదారుల కోసం రూ.1.10లక్షల కోట్లు ఖర్చు చేశాం. ఇప్పటికే రూ.వేల కోట్లతో రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయి. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ కోసం రూ.700 కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నాం. సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం రూ.1,248 కోట్లు కేటాయించింది'అని కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్‌పై రేవంత్ వ్యాఖ్యలను ఆయన ఖండించారు.

# స్పోర్ట్స్ అభివృద్ధిలో జిల్లాకే మొదటి ప్రాధాన్యత

-రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కొత్త కాపు శివసేన రెడ్డి ఎంఎల్ఏ మేఘా రెడ్డి
-జిల్లాలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తా
-దేశానికి క్రీడాకారులను అందించే రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం
-పెద్దగూడెం నుంచి వనపర్తి వరకు కాంగ్రెస్ కార్యకర్తల భారీ ర్యాలీ
-ర్యాలీ లో పాల్గొన్న, ఎమ్మెల్యే మేఘారెడ్డి, మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్




**వనపర్తి జులై 24 (చైతన్య గళం):** స్పోర్ట్స్ అభివృద్ధిలో రాష్ట్రంలోనే జిల్లాకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కొత్త కాపు శివసేనారెడ్డి ఎంఎల్ఏ మేఘా రెడ్డిలు అన్నారు.ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆధ్వర్యంలో స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డికి బుధవారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.అంతకుముందు మర్రికుంట నుంచి లక్ష్మీ కృష్ణ గార్డెన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.అనంతరం ఏర్పాటు చేసిన సన్మాన సభ కార్యక్రమంలో శివసేనారెడ్డి మాట్లాడుతూ.....గతంలో స్పోర్ట్స్ అభివృద్ధికి ఏ ప్రభుత్వం కేటాయించని నిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కేటాయించడం జరిగిందన్నారు. జిల్లాకు స్పోర్ట్స్ స్కూల్ మంజూరు చేయించడమే తన కర్తవ్యం అని తెలిపారు.రాష్ట్రంలోనే ఏకైక హాకీ అకాడమీ కలిగిన వనపర్తి లో రానున్న మూడు నెలల్లో టర్ఫ్ కోర్ట్ ఏర్పాటు చేయడం కోసం కృషి చేస్తా అన్నారు.రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గం తర్వాత వనపర్తి నియోజకవర్గానికే అధిక ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు.స్పోర్ట్స్ అభివృద్ధిలో భాగంగా ప్రతి జిల్లాకు 50 ఎకరాల భూమిని కేటాయించడం జరుగుతుందని, దేశానికి క్రీడాకారులను అందించే నెంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణను నిలుపుతామన్నారు.పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు తాను వెన్నుదన్నుగా ఉంటానని భరోసా ఇచ్చారు.

### బిజెపి ఎంపీలు ధర్నాకు కలిసి రావాలి... ఎమ్మెల్యే తూడి మేగా రెడ్డి

కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిన మోడీ ప్రభుత్వం పై పోరాటం చేయడానికి రాష్ట్రంలో బిజెపి పార్టీ నుంచి గెలిచిన 8 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ఎంపీలతో కలిసి రావాలని, ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర ధర్నా చేయాలని ఎమ్మెల్యే మెగా రెడ్డి అన్నారు.నియోజకవర్గంలో స్పోర్ట్స్ అభివృద్ధికి 30 నుంచి 40 కోట్ల రూపాయలు విడుదల చేసేలా కృషి చేయాలని శివసేనారెడ్డిని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని, ఇటీవలే రెండు లక్షల రైతు రుణమాఫీ చేయడం కాంగ్రెస్ పార్టీకే చెల్లిందన్నారు.పదేళ్లు పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తలు గుర్తిస్తామని, పార్టీ కోసం పనిచేసిన వ్యక్తులకు పదవులు నడుచుకుంటూ వస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్,మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, పీసీసీ డెలిగేట్ శంకర్ ప్రసాద్, శంకర్ నాయక్, ధనలక్ష్మి, విష్ణువర్ధన్ రెడ్డి, కౌన్సిలర్ బ్రహ్మం, వెంకటస్వామి, సతీష్, సత్యశిలా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రంలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**వనపర్తి జులై 24 (చైతన్య గళం):** వనపర్తి జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నివాసంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు 48వ జన్మదిన వేడుకలను పట్టణ పార్టీ అధ్యక్షుడు పల్సర్ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్స్ ను బిఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షులు గట్టు యాదవ్ పట్టణ పార్టీ అధ్యక్షులు పి.రమేష్ గౌడ్ మాట్లాడుతూ మలిదశ ఉద్యమంలో రాష్ట్ర సాధన కోసం కేటీఆర్ ప్రాణాలకు తెగించి ఉద్యమం చేశారని భవిష్యత్తు తరాల నాయకుడు ప్రజల సమస్యల ఎప్పటికప్పుడు ఖండిస్తూ ప్రభుత్వంపై యుద్ధం చేస్తున్న కె.టి.ఆర్ నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో,అష్టైశ్వర్యాలతో ఉండాలని కోరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్,గ్రంధాలయ మాజీ చైర్మన్ బి.లక్ష్మయ్య, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్,ప్రధాన కార్యదర్శి పరంజ్యోతి, కౌన్సిలర్ బండారు కృష్ణ,నాయకులు ఉంగ్లమ్ తిరుమల్, నీలస్వామి,సూర్యవంశపు గిరి,స్టార్ రహీమ్,సునీల్ వాల్మీకి, దెవర్ల నరసింహ,యుగంధర్ రెడ్డి, నందిమల్ల రమేష్,మురళీ సాగర్, నందిమల్ల రవి,కవిత, జోహేబ్,శిరిగిరి.మన్నెం, అరీఫ్,పాషా,గొర్ల బాలయ్య,చంద్రయ్య,అఖిలెందర్, నందిమల్ల సుబ్బు, లోకాజీ,నక్క మహేష్,ఇంతియాజ్, ఆ,టి.శ్రీను,సత్యం ,రవి,వజ్రాల రమేష్,తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# హైలెవల్ బ్రిడ్జి పనులు పరిశీలించిన మాజీ మంత్రి



**వనపర్తి జులై 24 (చైతన్య గళం):** మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి బుధవారం చినగుంటపల్లి,అంకూరు గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న హైలెవల్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత సాగునీళు ళ్ళ అందుబాటులోకి వచ్చియని అందుకు అనుగుణంగా నీళ్ళ సరఫరా మరియు రవాణా సౌకర్యాలు మెరుగుపడటానికి నియోజకవర్గంలో అనేక హైలెవల్ బ్రిడ్జిలను జరిగిందని కొన్ని హై లెవెల్ బ్రిడ్జి లు పూర్తి అయ్యాయి కొన్ని నిర్మాణాలు జరుగుతున్నాయి వాటిని వేగంగా పూర్తి చేయుటకు కాంట్రాక్టర్లు కృషి చేయాలని అధికారులు అందుకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బాలీశ్వర్ రెడ్డి,పురేందర్,చిట్యాల.రాము ఉన్నారు.

## పోడు భూముల సమస్యలపై అసెంబ్లీలో గల మెత్తిన నల్లమల్ల ముద్దుబిడ్డ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

**అచ్చంపేట్ జూలై 24 (చైతన్య గళం):** అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో అచ్చంపేట నియోజకవర్గం నల్లమల లో తండాలను అశాస్త్రీయంగా గ్రామపంచాయతీలుగా చేయడానికి అసెంబ్లీలో లేవనెత్తారు.ఇప్పటి కి కూడా తండాలు. గిరిజన గూడాలలో గిరిజనుల ఆదివాసి ప్రాంతాల్లో మౌలిక వసతులు లేవు రోడ్లు త్రాగునీరు విద్య వైద్య సౌకర్యాలు గత ప్రభుత్వం విస్మరించింది కాబట్టి మన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రాంతాలకు మౌలిక వస్తువులు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ...గత ప్రభుత్వం తండాలను గ్రామ పంచాయతీలుగా విడదీసి తమ ఓటు బ్యాంకు లబ్ధి పొందడానికి మాత్రమే చేశాయని అసెంబ్లీలో మాట్లాడడం జరిగింది నల్లమలలో గిరిజనులు ఆదివాసులు సాగు చేసుకుంటున్నాటువంటి పోడు భూముల విషయంలో గత ప్రభుత్వం ఇచ్చినటువంటి పట్టాలలో ఎవ్వరు కూడా వ్యవసాయం చేసుకోవడానికి నోచుకోవడం లేదు. సభలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క స్పందించి వెంటనే తండాలు గిరిజన ప్రాంతాలు పోడు భూముల విషయంలో ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారుఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మంత్రి సీతక్క కు డాక్టర్ వంశీకృష్ణ ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**తలకొండపల్లి జూలై 24 (చైతన్య గళం):** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో బీ.ఆర్.ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రివర్యులు సిరిసిల్ల శాసనసభ్యులు శ్రీ కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలు బీ.ఆర్.ఎస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీ.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు CL.శ్రీనివాస్ యాదవ్ హాజరై కేక్ కట్ చేసి కేటీఆర్ కి శు భాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ నాయకులు నరేందర్ గౌడ్, యాదయ్య ,భాస్కర్, శ్రీరామ్, శ్రీను ,రమేష్ యాదవ్ ,రాజు గుప్తా, శేఖర్, గోవర్ధన్ గౌడ్ ,శేఖర్, కృష్ణ ,శ్రీశైలం, జగన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## జిఎస్ఆర్ యువసేన ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు



**ఆమనగల్లు జులై 24 (చైతన్య గళం):** ఆమనగల్లు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలు జిఎస్ఆర్ యువసేన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా యువ నాయకుడు చలిచీమల సతీష్ మొక్కను నాటి ప్రతి ఒక్కరు మొక్కను నాటి పర్యావరణాన్ని కాపాడాలని తెలిపారు. నాటిన మొక్కలని బతికేలా సంరక్షణ బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కుమార్, కౌన్సిలర్ రాధమ్మ వెంకటయ్య, సీనియర్ నాయకులు కోట శీను మరియు జిఎస్ఆర్ నాయకులు శివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు రుణమాఫీ పై స్పష్టత లేదు

-కంటెస్టెడ్ ఎమ్మెల్యే గంగవరం రామకృష్ణారెడ్డి



**వనపర్తి జులై 24 (చైతన్య గళం):** రైతు రుణమాఫీ పై స్పష్టత ఇచ్చేది ఎవరని కాంటెస్టెడ్ ఎమ్మెల్యే గంగవరం రామకృష్ణారెడ్డి ఒక బుధవారం ప్రకటనలో తెలిపారు ఇటీవల కాంగ్రెస్ సర్కారు రైతు రుణమాఫీ పై పెద్ద మొత్తంలో ప్రచారం చేసుకున్నప్పటికీ రుణమాఫీపై స్పష్టత లేకుండా ఉందని, బ్యాంకుల దగ్గరకు రైతులు పెద్ద మొత్తంలో చేరుకొని బ్యాంకు అధికారులను వారి యొక్క రుణమాఫీ పై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు బ్యాంకు అధికారులు వారి దగ్గర ఎలాంటి స్పష్టమైన విధి విధానాలు తమకు రాలేదని చెబుతున్నారు. బ్యాంకు ఖాతాల్లో లక్ష రూపాయలు అందరికీ మాఫీ చేస్తున్నట్టు ఈనెల 18న పాలాభిషేకలతో కాంగ్రెస్ కార్యకర్తలు హంగామా చేశారు, కానీ రైతులు లక్ష రూపాయలలోపు ఉన్నవాళ్ల లొ కూడా కొంతమందికి ఖాతాలో డబ్బులు పడలేదని ఆందోళనకు గురవుతున్నారు దీనికి కారణం ఏమై ఉంటుంది అన్నది బ్యాంక్ అధికారులు కానీ ఇటు ప్రజా ప్రతినిధులు కానీ సరైన సమాధానం తెలుపు టలేదని వారు ఆందోళనకు గురవుతున్నారు కొందరు రేషన్ కార్డు ప్రామాణికమైమా? భూమి పాసుబుక్ ప్రామాణికమా? లేదా ప్రభుత్వ అధికారుల ఆలోచనలు ప్రామాణికమా అని రైతులకు తికమక అవుతున్నారు అని ఆయన అన్నారు. కావున ప్రభుత్వం వెంటనే రుణమాఫీ విషయంలో ఒక స్పష్టత ఇవ్వాలని రుణమాఫీ వర్తించే రైతులను గుర్తించి వారి యొక్క జాబితాను బ్యాంకులకు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# జిల్లాలో ప్రతి ఎకరానికి సాగునీరు అందిస్తాం

-మంత్రి జూపల్లి కృష్ణారావు
-నాగర్ కర్నూల్ జిల్లా గుడిపల్లి రిజర్వాయర్ నుంచి బుధవారం కల్వకుర్తి ఎస్ఐఎస్ ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు





**నాగర్ కర్నూల్ జులై 24 (చైతన్య గళం):** మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (ఎంజీకేఎస్ఐఎస్)లోని నాగర్ కర్నూల్ జిల్లాలోని గుడిపల్లిగట్టు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు రాష్ట్ర ఎక్సైజ్ మరియు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం మోటార్లకు ప్రత్యేక పూజ చేసి నీటిని విడుదల చేశారు.కల్వకుర్తి ప్రాజెక్టు పరిధిలోని 3.65 లక్షల ఎకరాల ఆయకట్టులో మూడింట రెండు వంతులకు పైగా గుడిపల్లిగట్టు రిజర్వాయర్ నుంచి నీరు అందుతోంది. రిజర్వాయర్ నుంచి నాగర్ కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట ప్రధాన కాల్వలకు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,శాసనసభ్యులు డాక్టర్ రాజేష్ రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, మోఘ రెడ్డి లతో కలిసి మంత్రి నీటిని విడుదల చేశారు. పంపుల ద్వారా ప్రతిరోజు 650 క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. .జిల్లాలోని కల్వకుర్తి అచ్చంపేట నాగర్ కర్నూల్ నియోజకవర్గం రైతులకు వాన దేవుడి దయతో రెండు పంటలకు సాగునీరు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవలే ఉమ్మడి జిల్లా ప్రాజెక్టుల సమీక్ష సమావేశంలో పనుల పురోగతిపై వేగవంతం చేసేలా చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ వహించిందని అందుకు ముఖ్యమంత్రి కృత నిక్షయంతో ఉమ్మడి జిల్లాల ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు .జిల్లాలోని వివిధ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ఎమ్మెల్యేలంతా రాష్ట్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కృష్ణమ్మకు పూలతో స్వాగతం పలికారు . జిల్లాలోని రైతంగానికి శశ్యామలంగా సాగునీరు అందాలని దేవుని ప్రార్థించారు. అంతకుముందు ఇంజనీరింగ్ అధికారులతో మంత్రి సమావేశమై నీటి లభ్యత విద్యుత్ వినియోగం తదితర అంశాలపై కులంకషంగా చర్చించారు.ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు ఎస్సీ సత్యనారాయణ రెడ్డి, ఈఈ రవీందర్, ఎస్వీఎన్ కంపెనీ ఎండి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు...

## సోమశిల వంతెన పనులు వేగవంతం చేయాలి

**-తల్లోజు ఆచారి**



**న్యూ ఢిల్లీ జులై 24 (చైతన్య గళం):** కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికై సోమశిల సిద్ధేశ్వర వంతెన పనులు వేగంగా చేయాలని మరియు నంద్యాల-జడ్చర్ల వయా కొల్లాపూర్ మీదగా రైల్వే లైన్ మంజూరు చేయాలని ఈరోజు ఢిల్లీలో కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జీ.కిషన్ రెడ్డి కి వారి నివాసంలో మాజీ జాతీయ బీసి కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి, నాగర్ కర్నూలు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు మరియు బీజేపీ నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించి వినతి పత్రం అందజేయడం జరిగింది.

## వెంకటయ్య వారి కుటుంబాన్ని పరామర్శించి చంద్రశేఖర్ రెడ్డి 3000,వెంకటయ్య 2000 ఆర్థిక సహాయం చేయడం జరిగింది



**తలకొండపల్లి జూలై 24 (చైతన్య గళం):** ఈ రోజు గట్టు ఇప్పలపల్లి గ్రామములో కానుగుల జంగయ్య (37) వయస్సు గల యువకుడు బ్రెయిన్ డెడ్ అయ్యి హాస్పిటల్ లో చికిత్స పొందుతు మరణించడం జరిగింది.ఈ విషయం తెలుసుకున్న తలకొండపల్లి మండలం BRS పార్టి వర్కింగ్ ప్రెసిడెంట్ టి. చంద్రశేఖర్ రెడ్డి మరియు మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య వారి కుటుంబాన్ని పరామర్శించి చంద్రశేఖర్ రెడ్డి 3000,వెంకటయ్య 2000 ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో BRS గ్రామ అధ్యక్షుడు ఏదుల రాజు, ఉపాధ్యక్షుడు కానుగుల జంగయ్య, మండల కృష్ణయ్య, అనంతరాములు, ఇట్యాల రవీందర్, జోలం వెంకటేష్,జీవ, సైదులు, పురుషోత్తం,టేకుల కొండల్,అనిల్,ఆంజనేయులు, శావుకు వెంకటయ్య, సత్యనారాయణ, అంజయ్య, కానుగుల మల్లేష్,కోలా అశోక్,లింగం యాదవ్,అంజి తదితరులు ఉన్నారు..

## ఆర్టీసీ బస్సును ఢీకొన్న బైక్ ఇద్దరు యువకులు మృతి



**హైదరాబాద్ జులై 24 (చైతన్య గళం):** హైదరాబాద్ లోని చందా నగర్ లో బుధవారం ఉదయం ఆర్టీసీ బస్సును ఓ బైకు రాంగ్ రూట్ లో వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు మృతి చెందారు.కాగా, మృతులను చందా నగర్‌కు చెందిన మనోజ్, రాజులుగా గుర్తించారు. ఇక, ఈ ప్రమాదంపై కేసు నమో దు చేసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం నిమ్మితం మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే, మదీనాగుడ జీఎస్ఎం మాల్ నుంచి చందానగర్‌కు బైక్‌పై మనో జ్, రాజులు వెళుతున్నారు. చందానగర్ జీఎస్ఎం మాల్ సమీపంలో యుటర్న్ దగ్గర రాంగ్ రూట్‌లో వెళుతూ.. ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టారు. బైక్ నడుపుతున్న మనోజ్ తో పాటు వెనకాల కూర్చు న్న రాజు కూడా అక్కడిక్కడే చనిపోయాడు.

## కేటీఆర్ జన్మదినం

**- మొక్కలు నాటిన ఎమ్మెల్సీ రాజు**



**కుత్బుల్లాపూర్, జులై 24 ( చైతన్య గళం):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్సీ శాంబిపూర్ రాజు స్థానిక నేతలతో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాజు మాట్లాడుతు మంత్రి కేటీఆర్ నిండు, నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని, భవిష్యత్ లో మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాక్షించారు.మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా జిల్లా పరిధిలోని నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, జీతయ్య, ప్రదీప్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# బ్రతకమని సర్కార్ పొలాలు ఇస్తే ఇదేం బుద్ధి

**-పాటు కాలువలు పాడుచేసి మట్టి వ్యాపారం**
**-నిబంధనలకు విరుద్ధంగా ఒకే కుటుంబానికి ప్రభుత్వ అసైన్డ్ పొలాలు**
**- షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు**
**-కొండన్నగూడ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్**
**-జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు**



**షాద్ నగర్ జులై 24 (చైతన్య గళం):** షాద్ నగర్ ప్రభుత్వం బతుకమని పేద ప్రజలకు అసైన్డ్ భూములను కేటాయిస్తే వాటిని నిబంధనలకు విరుద్ధంగా ఒకే కుటుంబం పెద్ద ఎత్తున సర్కార్ భూములను దక్కించుకొని.. ఇప్పుడు అదే భూములలో నిబంధనలకు వ్యతిరేకంగా అడ్డగోలుగా మట్టి వ్యాపారం చేస్తూ పైగా పాటు కాలువను పాడుచేసి ధ్వంసం చేసిన వ్యక్తులపై చట్టరీత్యా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు డిమాండ్ చేశారు. ఫరూక్ నగర్ మండలం కొండన్నగూడ గ్రామంలో సర్వేనెంబర్ 53/1/రు/1 లో ఉన్న 1ఎకరా 13 గుంటలు అదేవిధంగా సర్వేనెంబర్ 53/1అ/38 లో 3 ఎకరాల 34 గుంటలు మొత్తం ఐదు ఎకరాల ఏడు గంటల భూమి ఉందని, అదేవిధంగా సర్వేనెంబర్ 53/1అ 1లో 26 గుంటలు. సర్వేనెంబర్ 53/ 1ఓలో 1 ఎకరా 14 గుంటలు మొత్తం 2 ఎకరాల భూమిలో ప్రభుత్వ అసైన్డ్ భూమి మేడమోని విట్యాల కృష్ణయ్య, మేడమోని విట్యాల శ్యామల దంపతులకు ప్రభుత్వం అసైన్డ్ ఇచ్చిందని తెలిపారు. ఈ పొలంలో ఉన్న పాటు కాలువను సైతం వారు ధ్వంసం చేసి మట్టిని దర్జాగా విక్రయించారని పేర్కొన్నారు. వీరితో పాటు పక్కనే ఉన్న రామ్ రెడ్డి అనే వ్యక్తి కూడా అసైన్డ్ పొలాల్లో మట్టిని అక్రమంగా విక్రయించారని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. బుధవారం సంఘటన స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు సందర్శించారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కొండన్నగూడ గ్రామంలో సదరు సర్వే నెంబర్లలో వాటర్ షెడ్ల పనులు చేపట్టినట్టు తెలిపారు. అప్పటి వాటర్ షెడ్ చైర్మన్ కృష్ణయ్య యాదవ్ ఉన్న సమయంలో 20 లక్షల రూపాయలను మంజూరు చేసి వాటర్ షెడ్ అభివృద్ధి కోసం పాటు కాలువలు, ఆనకట్టలు నిర్మించినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వ అసైన్డ్ పొలాలలో ఇలా విచ్చలవిడిగా నిబంధనలకు వ్యతిరేకంగా మట్టిని తరలించి సొమ్ము చేసుకున్న వారిపై నీటిపారుదల శాఖ అధికారులు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఒకే కుటుంబానికి చెందిన మేడమోని కృష్ణయ్య అతని భార్య శ్యామల అదేవిధంగా అతని కుటుంబ సభ్యులపై నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ పొలాలు ఎలా ఒక కుటుంబానికే ఎక్కువ భూమి ఇచ్చారో అధికారులు చెప్పాలని కోరారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఒకే కుటుంబంలో ప్రతి వ్యక్తికి అసైన్డ్ పొలం ఎలా కేటాయించారు? అధికారులు సమగ్ర దర్యాప్తు జరపాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు ద్వారా కోరినట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు. ఈ అంశం క్షమించరానిదని ఆయన అభిప్రాయపడ్డారు. ఓవైపు ప్రభుత్వ అసైన్డ్ పొలాలను నిబంధనకు వ్యతిరేకంగా ఒకే కుటుంబం అనుభవిస్తూ పదిమందికి ఉపయోగపడే పాటు కాలువలను పాడుచేసి మట్టిని అమ్ముకోవడం క్షమించరాని నేరమని ఆయన తెలిపారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని బక్కని నర్సింహులు డిమాండ్ చేశారు.

# మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలకు రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలి

**-బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా.మేకల శిల్పారెడ్డి**



**వనపర్తి జులై 24 (చైతన్య గళం):** మహిళా మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా కేంద్రంలోని ఎన్విఆర్ బ్యాంకెట్ హాల్ లో జిల్లా అధ్యక్షురాలు అశ్విని రాధ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా.మేకల శిల్పా రెడ్డి గారిని జిల్లా ఉపాధ్యక్షులు ఏ. సీతారాములు వారి కుటుంబ సభ్యులు ఏ.కావ్య మరియు ఏ. భవ్య గజమాలతో సత్కరించారు. ముఖ్య అతిథి డా. మేకల శిల్పారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు హోం శాఖను నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని ముఖ్యమంత్రి ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకునే వ్యవహారాల్లో తలామునకలై ఉన్నాడని మహిళలపై ఏ చిన్న అగాయిత్యం జరిగిన మహిళా మోర్చా ముందుండి పోరాటం సాగించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారంలోకి వస్తే బెల్టు షాపులను ఎత్తివేస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం మద్యం అమ్మకాల ద్వారా ఆదాయాన్ని పెంచుకునే దిశగా ఆలోచిస్తుంది కానీ బెల్ట్ షాపులను ఎత్తివేసే ఆలోచన చేయడం లేదని ప్రభుత్వం బెల్ట్ షాపులను ఎత్తివేసే వరకు మహిళా మోర్చా ముందుండి పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. ఆగస్టు నుంచి జాతీయ పార్టీ ఆదేశం మేరకు ప్రతి నాయకురాలు కూడా పోలింగ్ బూత్ లో అత్యధిక సంఖ్యలో మహిళల సభ్యత్వం చేయించాలని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోడీ మహిళల కోసం ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్ అభియాన్ బేటి బచావో బేటి పడావో గర్భిణీలకు పౌష్టికాహార సరఫరా ద్వారా మాతృత్వ మరణాల తగ్గుదల మహిళా ఉద్యోగులకు 24 వారాల ప్రసూతి సెలవులు డ్రోన్ దీదీ యోజన చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తదితర సం సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకువెళ్లి బిజెపి గెలిచేలా కార్యాచరణ తయారు చేసుకోవాలని పేర్కొన్నారు.మంగళవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో అన్ని రాష్ట్రాలకు న్యాయం జరిగే విధంగా ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం అనవసర విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని గతంలో తెలంగాణకు ఎన్ని నిధులు నరేంద్ర మోడీ మంజూరు చేశారో కాంగ్రెస్ వారు ఆలోచించుకోవాలని కేంద్ర ప్రభుత్వం సహకారం లేకపోతే ఏ రాష్ట్రం కూడా అభివృద్ధి చెందలేదని గుర్తుంచుకోవాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్. లోకనాథ్ రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి మహిళా మోర్చా రాష్ట్ర సహకోశాధికారి ఎన్.జ్యోతి రమణ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి.అలివేలు మాజీ జిల్లా అధ్యక్షురాలు వారణాసి కల్పన మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు సూగూరు లక్ష్మి అరుణ కవిత పద్మమ్మ బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఏ సీతారాములు బండారు కుమారస్వామి పట్టణాధ్యక్షులు బచ్చు రాము ప్రధాన కార్యదర్శులు రాయన్న సాగర్ సూగూరు రాము పి ఎమ్ రాము విజయ్ రాఘవేందర్ కేశవులు తదితరులు పాల్గొన్నారు

# పేదలు,మహిళాభ్యున్నతి లక్ష్యంగా వికసిత్ భారత్ బడ్జెట్

**-మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా. మేకల శిల్పారెడ్డి**



**వనపర్తి జులై 24 (చైతన్య గళం):** వికసిత భారత్ లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా బుధవారం బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు డి.నారాయణ నేతృత్వంలో పట్టణ అధ్యక్షులు బచ్చు రాము అధ్యక్షతన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా.మేకల శిల్పారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో చారిత్రాత్మకంగా మూడవ పర్యాయం అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో ఆర్థిక శాఖ మంత్రి శ్రీమతి నిర్మల సీతారామన్ పేదలు రైతులు యువత మహిళా మహిళాభ్యున్నతి.. వికసితభారత్ లక్ష్యంగా రూ.48.20 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టారని యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకునేటందుకు రెండు లక్షల కోట్లతో MSME రంగానికి ప్రోత్సాహకాలు ప్రకటించి లక్షలాది మందికి ఉద్యోగ కల్పన సాధించేందుకు బాటలు వేశారన్నారు.ప్రప్రథమంగా గ్రామీణాభివృద్ధికి రూ. 2.66 లక్షల కోట్లతో గ్రామాల అభివృద్ధికి మహర్దశ ఏర్పడనుందని ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా గ్రామాలు పట్టణాలలో రూ. 10 లక్షల కోట్లతో మూడు కోట్ల ఇళ్ల నిర్మాణం ముద్రా రుణ పరిమితిన పది లక్షల నుంచి 20 లక్షలకు పెంపు మహిళలపై రిజిస్ట్రేషన్ చేస్తే స్టాంప్ డ్యూటీ తగ్గింపు ఐదు ఏళ్లలో ఐదు పథకాల కింద 4.1 కోట్ల యువతకు లబ్ధి 20 లక్షల మంది యువతకు శిక్షణ కోటి మందికి ఇంటర్నషిప్ షిప్ విద్యుత్ ప్లాంట్లు వైద్య కాలేజీలు జాతీయ రహదారులు రైల్వే శాఖకు రక్షణ రంగానికి గతంలో ఎన్నడూ లేనంతగా వికసితభారత్ లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 3.0 బడ్జెట్ ప్రవేశపెట్టడం జరిగిందని రాబోయే మూడేళ్లలో భారతదేశం ఆర్థిక అభివృద్ధిలో మూడవ స్థానానికి చేరుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రామన్ గౌడ్ మోర్చాల రాష్ట్ర నాయకులు శ్రీమతి ఎన్. జ్యోతి రమణ, శ్రీమతి పి. అలివేలు, కొమ్ము సామేలు, జిల్లా ఉపాధ్యక్షులు బి. కుమారస్వామి, ఏ. సీతారాములు, ఐటీ సెల్ విజయసాగర్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అశ్విని రాధ, జిల్లా ప్రధాన కార్యదర్శి సుగురు లక్ష్మీ, పట్టణ ప్రధాన కార్యదర్శులు రాములు, రాయన్న సాగర్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు ఆవుల కవిత యాదవ్, నాయకులు రాఘవేందర్, రవి కుమార్, కొండన్న, మన్యం తదితరులు పాల్గొన్నారు.